

కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32 (బుధవారం)
కనిష్ఠం : 27

కాకినాడ జీజీహెచ్‌లో
ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు 7

## నెలంతా యోగా సాధనపై అవగాహనా కార్యక్రమాలు

» కలెక్టర్ షాన్‌మోహన్ » కాకినాడలో యోగా మాసోత్సవాలు ఘనంగా ప్రారంభం





కాకినాడలో జరిగిన కార్యక్రమంలో యోగా చేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), మే 21 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల పాటు యోగామాసంగా పాటిస్తూ యోగా సాధనపై జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. బుధవారం కాకినాడ జిల్లా క్రీడామైదానం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి యోగా ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్‌తోపాటు ఎస్పీ బిందు మాధవ్, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, పిఠాపురం జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస రావు తదితరులు హాజరయ్యారు. అలాగే డీఆర్వో జె.వెంకట్రావు, జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ వివిధ యోగా అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర జిల్లా అధికారులతో కలిసి యోగాసనాలు సాధన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాలోని వివిధ అంశాలపై ప్రజలందరికీ అవగాహన కల్పిస్తామని తెలిపారు. యోగాంధ్ర-2025 థీమ్‌తో నెల రోజులపాటు వివిధ ప్రాంతాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. యోగాపట్ల అవగాహన, ఆసక్తి కలిగించే ఉద్దేశంతో అవగాహన ర్యాలీలు, మారథాన్ పరుగు, రంగోలి, విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. యోగా కార్యక్రమాలకు అవసరమైన ట్రైనర్లను ఏర్పాటు చేశామన్నారు. మండల స్థాయిలో నిర్వహించే కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా దేవదాయ శాఖ పరిధిలోని అన్ని దేవాలయాల్లోనూ ఈ నెలరోజులూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్య అధికారులు, వివిధ యోగా అసోసియేషన్ ప్రతినిధులు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.




యోగా చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే చినరాజప్ప తదితరులు

## భూ..తౌన్!

### రైతుల పాలిట భూతంగా భూదాన భూములు

| డివిజన్ / ఎకరాలు | |
|---|---|
| పెద్దాపురం | 2,268 |
| కాకినాడ | 553 |
| అమలాపురం | 795 |
| రాజమహేంద్రవరం | 412 |





భూదాన బోర్డు భూములు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భూదాన భూముల రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. భూమిపై హక్కు ఉన్నా ఆన్‌లైన్‌లో మార్పులు చేర్పులు జరగక..ఏ పథకాలు వర్తిం చక నానా తంటాలు పడుతున్నారు. అటు భూదాన బోర్డు పట్టించుకోక.. రెవెన్యూ అధికారులు సంబంధం లేదని వదిలేస్తుండడంతో నరకయాతన పడుతున్నారు. తమ సమస్య పరిష్కారానికి ఏం చేయాలో తెలియక సతమత మవుతున్నారు.ఎప్పుడో తాతల పేరున, తండ్రుల పేరునా ఉన్న రికార్డులే నేటికి ఆన్‌లైన్‌లో దర్శనమిస్తుండడంతో వాటిని తమ పేరున బదిలీ చేయించుకోవడానికి కాళ్లరిగేలా తిరుగుతున్నారు.**

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భూదాన యజ్ఞబోర్డు ఉండేది. ఇది భూదాన రైతులకు పట్టాలను మంజూరు చేసేది. ఈ బోర్డు నుంచి పట్టా తెచ్చుకున్న వారికి వారి పేరున అప్పట్లో ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాస్ పుస్తకాలను సైతం రెవెన్యూ అధికారులు మంజూరు చేసేవారు. ఆ తర్వాత భూదాన్ బోర్డును తొలగించడంతో గతంలో ఎవరైతే ఆన్‌లైన్‌లో ఉన్నారో వారి పేరునే నేటికీ ఆన్‌లైన్‌లో భూమి చూపిస్తోంది. వీరి వారసులు, వారి నుంచి కొనుగోలు చేసుకున్న రైతుల పేర్లు మాత్రం ఎన్నో ఏళ్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదు. దీంతో వీరికి ఏ పథకాలు వర్తించడం లేదు. తమ తండ్రి చనిపోవడంతో వారసుడిగా తమ పేరును ఆన్‌లైన్‌లో గుర్తించాలంటూ వేలాది మంది అన్నదాతలు ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రాలు అందించారు. అయినా ఇప్పటికీ ఫలితం ఉండడం లేదు. భూదాన బోర్డు నుంచి ఆ భూమి తమదేనంటూ పత్రం మంజూరు చేయించుకుంటే తప్పించి తాము ఏం చేయలేమని అధికారులు తెగేసి చెప్పేస్తున్నారు. చాలామంది రైతులకు అసలు భూదాన బోర్డు, రైతు చట్టాల పై అవగాహన లేదు.కొంత కాలంగా అధికారులు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటుచేసి భూసమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చారు. ఇవేవీ అన్నదాతల సమస్యలు పరిష్కరించలేదు. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పలువురు రైతులు మాట్లాడుతూ పాతికేళ్ల నుంచీ తమ కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయని కన్నీటి పర్యంతమవుతున్నారు.

### రీ సర్వేలోనూ అంతే...

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో భూముల రీసర్వే జరుగుతోంది. రీసర్వే ద్వారా తమకు హక్కులు లభిస్తాయని, పాతికేళ్ల కింద ఉన్న పేర్లకు బదులు వారసులుగా తమ పేర్లు ఆన్‌లైన్ అవుతాయని అన్నదాతలు భావించారు. కానీ రీసర్వేలో సైతం అధికారులు ఆ భూములు పాత యజమాని పేరునే గుర్తిస్తున్నారు. అదే సమయంలో ప్రస్తుతం సాగులో ఉన్న రైతు పేర్లను ప్రస్తావిస్తూ భూదాన అధికారులకు పంపుతున్నారు. ప్రస్తుత వారసులు తమ పేరున ఆన్‌లైన్ చేయాలని అర్జీలు ఇస్తున్నా భూదాన అధికారులు నిర్ణయం తీసుకోవాలని చెబుతున్నారు. దీంతో తమకు ఎప్పుడు హక్కులు వస్తాయో తెలియక వీరంతా దిగులు చెందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూదాన బోర్డు భూములను అప్పటి అధికార పార్టీ పెద్దలు కొందరు అడ్డగోలుగా తమ పేరున ఆన్‌లైన్ చేయించేసుకున్నారు. తమ పలుకుబడి ఉపయోగించుకున్నారు. సామాన్య రైతులు దిక్కుతోచని స్థితి ఎదుర్కొంటున్నారు. భూదాన బోర్డు భూములను పూర్వం నుంచీ సాగు చేసుకుంటున్న రైతులకు, వారి వారసులకు భూమిపై హక్కు కల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు. ప్రస్తుతం పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌లో 2,268 ఎకరాలు, కాకినాడ డివిజన్‌లో 553, అమలాపురం డివిజన్‌లో 795, రాజమహేంద్రవరంలో 413 ఎకరాలు, రంపచోడవరం డివిజన్‌లో 179 ఎకరాలు, కొవ్వూరులో ఇదేవిధంగా భూదాన భూములు ఉన్నాయి. వీటిలో దాదాపు అన్నింటికి అప్పట్లో పట్టాలిచ్చేశారు. వీటిని అనుభవిస్తున్న రైతులకు సంబంధించి వారసులకు హక్కులు లేకపోవడం ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది.

### వారసులకు హక్కుల్లేవ్..

గతంలో ప్రభుత్వాలు భూదాన భూములను రిజిస్ట్రేషన్ చేసుకునే వేసులు బాటును కల్పించగా 2000 సంవత్సరం నుంచి నిలిపివేశాయి. ఆ తర్వాత వారసులు వీటిని తమ పేరుపై మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నా కుదరడం లేదు. ఈ నేపథ్యంలో 4,211 ఎకరాల్లో పాతికేళ్ల కిందట రికార్డుల్లో ఉన్న రైతుల పేర్లే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. చనిపోయిన వారి స్థానంలో వారసుల పేర్లను సైతం తాజా రీసర్వేలోను గుర్తించడం లేదు. దీంతో వీరంతా తమ గోడు వినాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో కొందరు పెద్దలు మాత్రం భూదాన భూములను పరపతితో ఆన్‌లైన్ చేయించేసుకున్నారు.

» భూదాన్ భూముల అగచాట్లు
» హక్కు ఉన్నా పథకాలకు దూరం
» ఆన్‌లైన్‌లో మార్పులు చేర్పుల్లేవ్
» పాతికేళ్లుగా ఎదురుచూపులు
» ఉమ్మడి జిల్లాలో 4,211 ఎకరాలు
» అధికారులకు రైతుల మొర
» చనిపోయినా రికార్డుల్లోనే..
» రీసర్వేలోను అదే తీరు
» కళ్లెదుట భూమి..కాగితాల్లో లేదు

అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ల ద్వారా పదుల కొద్దీ ఎకరాల భూమిపై యాజమాన్య హక్కులు పొందారు. అప్పుడు ఇద్దరు కలెక్టర్లు అడ్డగోలుగా వ్యవహరించారు. పాతికేళ్ల కింద ఆక్రమించిన, కొనుగోలు చేసిన వాటిని ఇష్టానుసారం తమ పేరుపై బదిలీ చేయించేసుకుని హక్కులు పొందారు. కోనసీమ జిల్లా రామచంద్రపురం, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఉన్నట్టు సమాచారం. సామాన్య రైతుల గోడు మాత్రం ఎవరూ వినడం లేదు. 2000 ఏడాదికి ముందు కొనుగోలుచేసిన యజమానులు సైతం అర్జీలతో ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

## పోస్టులు 1241
## దరఖాస్తులు 63,004



» తూర్పున డీఎస్సీకి తీవ్ర పోటీ
» ఒక్కో ఉద్యోగానికి 50 మంది
» ఉమ్మడి జిల్లాలో పోస్టులు తక్కువ
» వెల్లువెత్తిన దరఖాస్తులు
» పరీక్షకు 38,617 మంది
» జూన్ 6 నుంచి పరీక్షలు

కాకినాడ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీకి దరఖాస్తులు పోటెత్తాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల డీఎస్సీ పోస్టులు భర్తీ చేయలేదు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ నిరుద్యోగులు లక్షలాదిగా పెరిగిపోయారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా డీఎస్సీకి అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అన్ని మేనేజ్‌మెంట్లకు కలిపి 1241 పోస్టులుండగా, 63,004 దరఖాస్తులు వచ్చాయని అధికారులు వెల్లడించారు. ఒక్కో పోస్టుకు సగటున 50 దరఖాస్తులు రావడంతో అభ్యర్థుల మధ్య తీవ్రపోటీ నెలకొంది. కొలువు కొట్టాలంటే కష్టపడాల్సిందేనని నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు అనుకుంటున్నారు.

### 15తో ముగిసిన గడువు

డీఎస్సీ నోటిఫికేషన్‌కు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 63,004 దరఖాస్తులు వచ్చాయి. 38,617 మంది అభ్యర్థులు దరఖాస్తుచేసుకోగా 14,380 మంది పురుషులు, 24,237 మంది మహిళలు ఉన్నారు. దరఖాస్తుల నమోదులో మహిళలే టాప్‌గా ఉండడం విశేషం. కేటగిరీల వారీగా ఓసీ 5,120, బీసీ-ఏ 2,810, బీసీ-బీ 6,991, బీసీ-సీ 554, బీసీ-డీ 3,636, బీసీ-ఈ 568, ఎస్సీ గ్రేడ్-1 87, ఎస్సీ గ్రేడ్-2 2,572, ఎస్సీ గ్రేడ్-3 10,066, ఎస్టీ-6,213, ఈడబ్ల్యూఎస్ 3,782, అలాగే దివ్యాంగుల కేటగిరీ నుంచి వీఎచ్ 159, హెచ్‌హెచ్ 36, ఓహెచ్ 847, ఎంఐ 6 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 15తో ముగిసింది. 20 నుంచి మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారు. హాల్ టికెట్లను ఈనెల 30 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 6 నుంచి జూలై 6 వరకూ ఆయా కేటగిరీల వారీగా సీబీటీ విధానంలో పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షల నిర్వహణ అనంతరం ప్రాథమిక కీ విడుదల, అభ్యంతరాల స్వీకరణ, తుది కీ విడుదలచేసి మెరిట్ జాబితా ప్రకటించనున్నారు.

### ఉద్యోగాల వివరాలివీ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,241 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీచేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్ 608, పీఈటీలు 210, ఎస్జీటీ 423 పోస్టులు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తెలుగు 65,హిందీ 78, ఆంగ్లం 95, గణితం 64, ఫిజికల్ సైన్స్ 71, బయోలాజికల్ సైన్స్ 103, సోషల్ 132, వ్యాయామ విద్య 210 ఉద్యోగాలతోపాటు 423 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ ఉద్యోగాలు ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమకు సంబంధించి ఫిజికల్ సైన్స్ 3, బయోలాజికల్ సైన్స్ 4, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య 1, ఎస్జీటీలు 104 మొత్తం 112 ఉద్యోగాలను భర్తీచేయనున్నారు. ప్రత్యేక విద్యకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 13 టీజీటీలు, 3 పీఈటీలు, 15 ఎస్జీటీలతో కలిపి 31 పోస్టులు భర్తీకానున్నాయి. జోన్ 2 (ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా)కి సంబంధించి ఏపీఆర్ఎస్, ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూ, బీసీ, సోషల్ వెల్ఫేర్‌కు సంబంధించి పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 3, పీఈటీ 24లతో కలిపి మొత్తం 348 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీచేయనున్నారు. ఇక డీఎస్సీకి దరఖాస్తుచేసుకున్నవారిలో మహిళా అభ్యర్థులే ఎక్కువ.





గోదావరి కళాక్షేత్రంలో టీడీపీ జిల్లా మహానాడు కోసం సిద్ధమైన ప్రాంగణం.. ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

## టీడీపీ జిల్లా మహానాడు నేడే

కాకినాడ, మే 21 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా కేంద్రంలో టీడీపీ ఆధ్వర్యంలో జిల్లా మహానాడు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం రాజా ట్యాంక్‌లో ఉన్న గోదావరి కళాక్షేత్రంలో మహానాడును అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు. ఇప్పటికే కాకినాడ ప్రధాన కూడళ్లలో భారీఎత్తున స్వాగత ఏర్పాట్లతో కూడిన బ్యానర్లను ఏర్పాటుచేసి కాకినాడ పసుపుమయం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో జరిగే ఈ మహానాడుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ హాజరయ్యే అవకాశం ఉంది. అలాగే జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు హాజరై తీర్మానాలు ఆమోదించనున్నారు. ఆ అంశాలను రాష్ట్ర మహానాడుకు పంపనున్నారు. గురువారం మినీమహానాడు-2025 జరిగే సభా స్థలాన్ని నవీన్ సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉదయం పది గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.

సత్యదేవుడి హుండీల ఆదాయం
రూ.1.55 కోట్లు
హుండీల్లో 48 గ్రాముల బంగారం, 730 గ్రాముల వెండి 7

## జిల్లాలో భారీ వర్షం.. అత్యధికంగా కరపలో 71.8 మి.మీ వర్షపాతం

కాకినాడ, మే 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో బుధవారం కూడా పలుచోట్ల భారీ వర్షం కురిసింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి వాతావరణం మేఘావృతంగా మారి ఏకధాటిగా బుధవారం మధ్యాహ్నం వరకు వాన కురుస్తూనే ఉంది. కాకినాడ నగరంతోపాటు పిఠాపురం, కరప, పెదపూడి, శంఖవరం, జగ్గంపేట తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడగా, మిగతాచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈదురుగాలులకు చెట్లు పడిపోవడంతోపాటు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలోని కరపలో 71.8 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. ఏలేశ్వరంలో అత్యల్పంగా 5.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక పెదపూడిలో 38.2, శంఖవరంలో 30.2, జగ్గంపేటలో 29.2, తాళ్లరేవులో 27.0, కాజులూరులో 24.4, కాకినాడ అర్బన్ 22.4, పెద్దాపురంలో 18.6, గండేపల్లి 17.2, రౌతులపూడి 16.4, కిర్లంపూడి 15.4, తొండంగి 15.2, తుని 14.8, గొల్లప్రోలు 14.8, ప్రత్తిపాడు 14.0, కాకినాడ రూరల్ 14.0, పిఠాపురం 12.0, యు.కొత్తపల్లి 11.8, కోటనందూరు 8.8, సామర్లకోట 8.4మి.మీ వర్షపాతం నమోదైంది.



తునిలో బుధవారం కురుస్తున్న వాన

## అటు మొరాయింపు..
## ఇటు మినహాయింపు

» రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు సాంకేతిక చిక్కులు
» వివాహ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతానికి చర్యలు

(కాకినాడ/సర్పవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కొత్త రేషన్ కార్డుల ప్రక్రియలో గందరగోళ పరిస్థితులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా సాంకేతిక సమస్యలు తలనొప్పిగా మారాయి. పౌరసరఫరాల శాఖ వెబ్‌సైట్లో సాంకేతిక ఇబ్బందులకు ఒకేసారి వందల మంది సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకునేందుకు పోటెత్తుతుండడంతో ఈ ఇబ్బందులు నెలకొంటున్నాయి. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వస్తున్న వారు రోజుల తరబడి సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరోపక్క ప్రభుత్వం వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం అవసరం లేదని చెబుతున్నా, దరఖాస్తుదారులు మాత్రం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పడిగాపులు పడుతున్నారు. అయితే కొన్ని విషయాల్లో మాత్రం ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. త్వరితగతిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా ఆప్షన్లను మార్చింది. ప్రభుత్వం నుంచి ఏ పథకం పొందాలన్నా రేషన్ కార్డు తప్పనిసరి. వైసీపీ హయాంలో వీటి జారీలో జరిగిన తప్పిదాలు నేటికీ లబ్ధిదారులను వెంటాడుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక తొలిసారి రేషన్ కార్డుల జారీకి అవకాశం కల్పించింది. గతంలో జరిగిన తప్పిదాల వల్ల ప్రస్తుతం కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి.

### ధ్రువపత్రం నుంచి మినహాయింపు..

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకుంటున్న కొత్త జంటలకు కూటమి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఇప్పటివరకు తల్లిదండ్రుల కార్డుల్లో సభ్యులుగా ఉన్నవారు కొత్తకార్డుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీనికి మొదట్లో ప్రభుత్వం ఆధార్‌కార్డులు, పాత రేషన్‌కార్డుల నకలు, వివాహ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేసింది. దీంతో అనేక మంది ప్రస్తుతం వివాహ రిజిస్ట్రేషన్ పత్రాలు తీసుకునేందుకు నానాపాట్లు పడుతున్నారు. నోటరీ, పెళ్లి శుభలేఖ, పెళ్లి సమయంలో ఫొటోలు వంటి తదితర వివరాలు కచ్చితంగా ఉండాలని కోరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో వివాహ ధ్రువపత్రం నుంచి మినహాయింపు ఇచ్చారు.

### అయినా క్యూ కడుతున్నారు..

ప్రభుత్వం రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు వివాహ ధ్రువీకరణ పత్రం నుంచి మినహాయింపు ఇచ్చినా.. కొత్త జంటలతోపాటు, పాత జంటలు కూడా పెద్దఎత్తున జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పెద్దఎత్తున తరలివస్తున్నారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కాకినాడ జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి గత వారం రోజులుగా సుమారు 200కు పైగా వివాహ రిజిస్ట్రేషన్ దరఖాస్తులు వచ్చాయి. పెళ్లయిన 60 రోజుల్లోపు అయితే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. అంతకు మించితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలి. చాలామంది పెళ్లయ్యి ఎన్నో ఏళ్లు అవుతున్నా వారు చలానాకు రూ.500, కార్డు ప్రింటింగ్‌కు రూ.500, ఆపై ఖర్చులు రూ. 3-4 వేలు ఇలా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే.. ప్రభుత్వం ఈ వివాహ రిజిస్ట్రేషన్ తంతు త్వరితగతిన పూర్తిచేసేలా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో వధూవరులు, సాక్షుల వేలిముద్రల సేకరణ ఆప్షన్‌ను తొలగించింది. తద్వారా వివాహన రిజిస్ట్రేషన్ నమోదు వేగవంతం కానుంది. ఇది మంగళవారం నుంచి అందుబాటులోకి వచ్చినట్టు సబ్ రిజిస్ట్రార్ తెలిపారు.

### విభజన కుదిరేలా..


ప్రస్తుతం రేషన్ కార్డులు ఉన్నవారి కుటుంబాల్లోనే సభ్యుల విభజనకు అవకాశం ఇచ్చారు. కుటుంబ(హౌస్‌హోల్డ్ డేటా) విభజనకు కూడా అనేబుల్ చేయాలని పలువురు కోరుతున్నారు. ఇక ఒంటరి మహిళలు దరఖాస్తు చేసుకోవడంలోనూ కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. 50 ఏళ్లు పైబడిన వారు, పెళ్లయ్యి పిల్లలు లేనివారే ఒంటి మహిళల కింద దరఖాస్తు చేసేందుకు వీలుంటుంది. పిల్లలు ఉన్న వారికి దూరంగా ఉంటున్న వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండడం లేదంటున్నారు. భార్యభర్తలు విడివిడిగా ఉంటున్నా వివాహ పత్రాలు కోరుతున్నారు.

### మొరాయిస్తున్న సర్వర్లు..

బియ్యంకార్డులకు దరఖాస్తుకోసం గ్రామ, వార్డు సచివాలయాలకు వెళుతున్న వారు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సర్వర్ పనిచేయడం లేదనే సమాధానం వస్తోంది. కొద్దిసేపు పనిచేసినా ఒక్కో దరఖాస్తు నింపేందుకు గంట, గంటన్నర సమయం పడుతోంది. ఉదయం పది గంటల ముందు, సాయంత్రం ఐదు గంటల తర్వాతే సర్వర్ పనిచేస్తోంది.

**వచ్చిన రేషన్ దరఖాస్తులు ఇలా..**

| | |
|---|---|
| కొత్త కార్డుల దరఖాస్తులు | 1655 |
| చిరునామా మార్పుకోసం | 336 |
| కరెక్షన్ ఆఫ్ రాంగ్ ఆధార్ సీడింగ్ | 159 |
| సభ్యుల చేరిక కోరుతూ వచ్చిన దరఖాస్తులు | 13,572 |
| తొలగింపు కోరుతూ వచ్చినవి | 517 |
| తాజాగా కార్డులు జారీ కోరుతూ | 1177 |
| సరెండర్ కోరుతూ వచ్చినవి | 22 |
| ఇప్పటివరకు రేషన్‌కార్డుల సర్వీసులకు వచ్చిన మొత్తం దరఖాస్తులు | 17,438 |



# కూరగాయలతో జీవ వైవిధ్యం

## వెజిటబుల్ కార్వింగ్ కళతో తయారుచేసిన గోవిందరాజులు మాస్టారు

గొల్లప్రోలు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్యం గురించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు వెజిటబుల్ కార్వింగ్ కళ ద్వారా కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ స్కూలు జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు తయారుచేసిన అంశాలు ఆకట్టుకుంటున్నాయి. ఆయన కాయగూరలపై రకరకాల జంతువులు, చెట్లను చెక్కారు. కాకరకాయలతో కప్ప, మొసలి, గుమ్మడికాయతో సముద్రపు గుర్రం, చేప, క్యారెట్‌లతో జాతీయ పక్షి నెమలి, తాబేలు, చెట్లు తయారు చేశారు. గురువారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వీటిని తయారు చేసినట్టు గోవిందరాజులు చెప్పారు.





వెజిటబుల్ కార్వింగ్‌తో చెక్కిన ఆకృతులను చూపుతున్న ఉపాధ్యాయుడు గోవిందరాజులు

## చిత్ర వైవిధ్యం...



అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట సత్య ఆర్ట్ అకాడమీ విద్యార్థులు ముఖేష్, చక్రి, గౌతమ్ గీసిన పలు చిత్రాలు ఆలోచింపజేస్తున్నాయి. గురువారం జరిగే కార్యక్రమంలో వీటిని ప్రదర్శిస్తామని డ్రాయింగ్ టీచర్ మండపల్లి సత్యానందం చెప్పారు.

- మండపేట

# కూత కోత



- రోజుకు ఐదు స్పెషల్ రైళ్లు
- ప్రతిరోజూ పలు రైళ్లు రద్దు
- ఎటెళ్లాలన్నా విపరీతమైన రద్దీ
- ఉమ్మడి జిల్లా ప్రయాణికులకు వేసవి సెలవుల్లో నరకమే

## వెయింటింగ్ లిస్ట్ 210

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రైల్వే తీరు చిత్రంగా ఉంది. ఓవైపు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామంటూ.. మరోవైపు నడుస్తున్న రైళ్లను రద్దు చేస్తోంది. దీంతో ప్రత్యేక రైళ్లలో కూడా బెర్తులు దొరక్క ఉమ్మడి తూర్పు గోదావరి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వేసవి సెలవులు మరో 20 రోజుల్లో ముగుస్తాయి. దీంతో ఇప్పటికే సెలవులకు చుట్టాల ఇళ్లకు, విహారానికి వెళ్లిన వాళ్లు ఇంటి ముఖం పట్టగా.. ఇప్పుడు సెలవులకు ఊరు విడిచి వెళ్లే వారూ ఉన్నారు. ఈ ప్రయాణికులతో రద్దీ ఎక్కువగా కనిపిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ వైపు ప్రయాణాలు అధికంగా ఉన్నాయి. దీంతో పాటు బెంగళూరు కూడా ఎక్కువగా వెళ్తున్నారు. కేరళ, తమిళనాడు విహారానికి వెళ్లే వారికి రైళ్లలో ప్రస్తుతం బెర్తులు దొరకడం ఇబ్బంది అవుతోంది. రాజమహేంద్రవరం, కాకినాడ రైల్వే స్టేషన్ల గుండా సాధారణ రోజుల్లో రోజుకు సరాసరిన 50వేల మంది దాకా రాకపోకలు సాగిస్తుంటారు. వేసవి సెలవుల్లో ఆ రద్దీ మరో అంత ఉంటుంది. దీనికి అనుగుణంగా రైళ్లు లేకపోవడం, ఇంటర్ సిటీలు వేయడానికి రైల్వేకు నిబంధనాలు అడ్డువస్తుండడంతో ప్రయాణికులు అవస్థ పడుతున్నారు. అసోం, బెంగాల్, ఉత్తరాఖండ్, ఒడిశా వైపు నుంచి వచ్చే రైళ్లలో కాలుపెట్టడానికి కూడా వీలుండట్లేదు. లేదు. గౌతమి మినహా హైదరాబాద్‌కి ఏ రైలులోనూ ఉమ్మడి 'తూర్పు' ప్రయాణికులకు కోటా ఉండదు. దీంతో రాజమండ్రి నుంచి ప్రారంభమయ్యేలా రైళ్లు నడపాలనే డిమాండ్ పెరుగుతోంది. ఇక్కడి నుంచి వందే భారత్ ప్రకటించినా ఎప్పుడు పట్టాలెక్కుతుందో గుట్టుచప్పుడు కాకుండా ఉంది.

కాకినాడ, కోనసీమ, మన్యం, తూర్పు గోదావరి.. నాలుగు జిల్లాలకు గేట్‌వే వంటి రాజమండ్రి రైల్వే స్టేషను ద్వారా హైదరాబాద్, బెంగళూరులకు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ప్రతిరోజూ హైదరాబాద్‌కి సుమారు 18 రైళ్లు నడుస్తుండగా.. వాటిలో 10 నిత్యం రాకపోకలు సాగిస్తాయి. కాకినాడ నుంచి గౌతమి రోజూ ఉండగా.. రోజూ ఒకట్రెండు వారాంతపు రైళ్లు ఉంటాయి. వేసవి రద్దీ క్లియర్ చేయడానికంటూ పలు స్పెషల్ రైళ్లను నడుపుతున్నారు. అయితే అవి సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించేవి కావడంతో ఈ ప్రాంతం వాళ్లకు ఎలాంటి ఉపయోగమూ ఉండట్లేదు.

ఉదాహరణకు ప్రతి గురువారం నహర్‌లగూన్ (రాజస్థాన్)-చర్లపల్లి, కటక్ (భువనేశ్వర్)-సికింద్రాబాద్ రైళ్లు నడుస్తున్నాయి. వీటిలో ఎక్కడానికి కూడా వీలుండదు. రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కి వందే భారత్‌కి స్లీపర్ క్లాస్ 1425, ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ 2535 ఉన్నా వెయిటింగ్ లిస్టే. గరీబ్‌రథ్‌కి జూన్ 8 వరకూ ఖాళీల్లేవు. ప్రతి గురువారం నడిచే విశాఖ-శిరిడీకి జూన్ 5 వరకు, ఫలక్‌నుమా జూన్ 12, విశాఖ-మహబూబ్‌నగర్ జూన్ 10, గోదావరికి జూన్ 11, గౌతమికి జూన్ 10 వరకు స్లీపర్ రిజర్వేషన్లు లేవు. ఏసీ క్లాసుల పరిస్థితి కూడా అలాగే ఉంది. కోకనాడ, జన్మభూమికి కూడా అదే పరిస్థితి ఉంది.

బెంగళూరు రైలులో వెళ్లాలంటే తత్కాల్ దొరికితే అదృష్టమే. స్లీపర్ సాధారణ రిజర్వేషన్లు చూస్తే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కి 23న వెయిటింగ్ లిస్టు 210, శేషాద్రికి 132 ఉంది. జూన్ 25 వరకు స్లీపర్ ఖాళీ లేవు. గురువారం నడిచే అంగ ఎక్స్‌ప్రెస్‌కి వెయిటింగ్ లిస్టు చూపెడుతుండగా.. హౌరా-బెంగళూరు రైలు జూన్ 2 వరకూ రిగ్రేట్ చెప్పేసింది. బెంగళూరుకు రోజుకు నాలుగైదు రైళ్లు నడుస్తుండగా.. వాటిలో మూడు మాత్రమే నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి.





హతియా-బెంగళూరు ట్రైన్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

### ● అవి వేసి.. ఇవి రద్దు

ఆపరేషనల్, మెయింటెన్స్ ఇలా రకరకాల కారణాలతో తరచుగా రైళ్లను రద్దు చేస్తున్నారు. రైళ్లు ఆలస్యంగా నడవడం పరిపాటే. అయితే ఇప్పుడు రైలు వచ్చి మనం ఎక్కి గమ్యానికి చేరితే చేరినట్లుగా పరిస్థితి ఉంది. సమయ పాలన తర్వాత సంగతి.. ఏ రైలు ఎన్ని గంటలకు వస్తుందో, రద్దు అవుతుందో తెలియని దుస్థితి నెలకొంది. రైళ్లను ప్రయాణ సమయానికి రెండు, మూడు రోజుల ముందు కూడా రద్దు చేసేస్తుండడంతో టూర్ ప్లాన్ అంతా నాశనం అవుతోందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక రైళ్లు వేశామని చెప్తున్న రైల్వే శాఖ పలు రైళ్లను రద్దు చేస్తుండడంతో ప్రత్యేక రైళ్లు నడుపుతున్న ఫలితం ఉండడం లేదు. కాకినాడ నుంచి అసలు ప్రత్యేక రైళ్లే లేవు. సామర్లకోట, రాజమండ్రి వచ్చి ఎక్కాల్సిందే.

తాజాగా ఈ నెల 22న 02863 సంత్రాగచి-యశ్వంత్‌పూర్, 23న 22817 హౌరా-మైసూరు, 23న 22850 సికింద్రాబాద్-షాలిమార్, 24న 02864 యశ్వంత్‌పూర్-సంత్రాగచి, 25న 22818 మైసూరు-హౌరా రైళ్లను రద్దు చేసేసింది. దీంతో ఈ రద్దీ అంతా ప్రత్యేక, రోజువారీ, వారాంతపు రైళ్లపై పడనుంది.

### ● పుణ్యక్షేత్రాలకు వెళ్లాలన్నా....

వేసవి సెలవుల్లో విహారం కంటే ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి ఎక్కువగా పుణ్య క్షేత్రాలకు వెళతుంటారు. ఒడిశాలోని పూరి, కోణార్క్, తమిళనాడులో మదురై, తంజా వూరు, కుంభకోణం, కన్యాకుమారి, కేరళలోని తిరువనంతపురం, మహారాష్ట్రలోని శిరిడికి ఎక్కువగా ప్రయాణాలు ఉంటాయి. కానీ రెండు నెలల ముందు రిజర్వేషన్లు చేయించుకంటే పర్వాలేదు. కానీ ఇప్పటికి ఇప్పుడు కావాలంటే ఎంతమాత్రం దొరికే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు నడిపితే కాస్త ఊరటగా ఉంటుందని ప్రయాణికులు చెప్తున్నారు. మూడు జిల్లాల ఎంపీలు కల్పించుకోవాలని వారు కోరుతున్నారు.

జన సాధారణ్ రైళ్లు ఉన్నాయని రైల్వే శాఖ చెప్తున్నా... అవి గువాహటి, హౌరా వంటి సుదూర ప్రాంతాల నుంచి ఉండడంతో అక్కడే బోగీలు నిండిపోతాయి. ఈ ప్రాంతం వాళ్లకు వాటితో ఎలాంటి ఉపయోగమూ లేదు. చెన్నైకి టాటా, ధన్‌బాద్, పురూలియా, న్యూతిన్సూకియా, షాలిమార్ (కోరమాండల్), హౌరా, భువనేశ్వర్ నుంచి రైళ్లు ఉన్నాయి. హౌరా-కన్యాకుమారి, భువనేశ్వర్-పుదుచ్చేరి, ముజఫర్‌పూర్-జోలార్‌పేట్ వరకు వారానికి ఒకసారి, సిల్చార్-కోయంబత్తూరు, భువనేశ్వర్-చెన్నై, జసిధ్-తాంబరం (గురు), ఖరగ్‌పూర్-విల్లుపురం, భువనేశ్వర్-రామేశ్వరం, విశాఖ-చెన్నై (శుక్ర), హౌరా-తిరుచురాపల్లి (సోమ,శుక్ర) గువాహటి నుంచి మూడు రోజులు జోలార్‌పేట్ వరకు, షాలిమార్-త్రివేండ్రం (మంగళ, బుధ) ఉన్నాయి. సంత్రాగచి-చెన్నై ఏసీ ఎక్స్‌ప్రెస్ బుధ, శనివారాల్లో నడుస్తోంది. వీటిలో బెర్తులు దొరకాలంటే అదృష్టాన్ని నమ్ముకోవాల్సిందే. కాకినాడ నుంచి చెన్నైకి వారానికి మూడు రోజులు తాంబరం ఎక్స్‌ప్రెస్, మరో మూడు రోజులు సర్కార్ ఉన్నాయి. కానీ వీటికీ రిజర్వేషను వెయిటింగ్ లిస్టులోకి వెళ్లిపోయింది.

# నాటక రంగాభివృద్ధికి ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుంది

● రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్

● ఘనంగా ప్రారంభమైన మూలారెడ్డి పరిషత్ నాటిక పోటీలు



రామవరంలో జాతీయస్థాయి నాటిక పోటీలను ప్రారంభించి మూలారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కందుల దుర్గేష్



ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

అనపర్తి, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాటిక రంగాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గంలో మంత్రిగా పనిచేయడం తన అదృష్టమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం రాత్రి అనపర్తి మండలం రామవరంలో నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ 36వ జాతీయస్థాయి సాంఘిక నాటికల పోటీలను మంత్రి దుర్గేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిషత్ వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన నాటిక పోటీల ప్రారంభసభలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నంది నాటకోత్సవాలను పునఃప్రారంభించి అనేకమంది కళాకారులను సత్కరించామన్నారు. నాటక రంగం అంతరించి పోలేదని కళ బ్రతికే ఉందని ప్రోత్సాహమే కరువైందన్నారు. కళాకారులకు అందించే పింఛన్లను సైతం వైసీపీ ప్రభు త్వం నిలిపివేసి కళాకారులకు తీరని అన్యాయం చేసిందన్నారు. నాటక రంగానికి వైభవం తీసుకువచ్చే విధంగా పరిషత్‌లకు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ ఏడాది నవంబరులో నంది అవార్డుల ప్రధానోత్సవం జరుగుతుందని అన్నారు. తండ్రి ఆశయాన్ని నిలిపేందుకు పరిషత్‌ను తన భుజస్కందాలపై వేసుకు ని పరిషత్‌ను నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభినందనీయుడని అన్నారు. రాష్ట్ర గనులు, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ కళలను బ్రతికించాలన్న మూలారెడ్డి సంకల్పాన్ని వారసత్వంగా తీసుకుని ఓ వైపు ప్రజాసేవ మరోవైపు కళాసేవ చేస్తున్న రామకృష్ణారెడ్డికి కళామతల్లి ఆశీస్సులు మెండుగా ఉంటాయని అన్నారు. ఈ పరిషత్ శత వార్సికోత్సవాలు దిగ్విజయంగా జరుపుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు. సినీ నటుడు గౌతమ్‌రాజు మాట్లాడుతూ గోదావరి తల్లి ఎందరో కళాకారులను, కళా పోషకులను అందించిందని పరిషత్ ఏర్పాటు ద్వారా ఎంతో మంది కళాకారుల అభ్యున్నతికి పాటు పడిన నల్లమిల్లి కుటుంబ సేవలు కళాకారులు మరచి పోలేరన్నారు. అదే విదంగా అభినయ నాటిక పరిషత్ అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్, రాష్ట్ర పరిషత్ నిర్వాహకుల సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ప్రసంగించి పరిషత్‌ను కొనియాడారు. పరిషత్ అధ్యక్షుడు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తన తండ్రి మూలారెడ్డికి నాటక రంగంపై ఉన్న ప్రేమతో పరిషత్‌ను ప్రారంభించారని ఆయన ఆశయ సాధన కోసం పరిషత్‌ను ముందుకు తీసుకువెళతానని అన్నారు. ఈ సందర్భంగా మీడియా రంగం ద్వారా సేవలందిస్తున్న మహా న్యూస్ ఎండీ మారెళ్ళ వంశీకృష్ణను ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త మేడపాటి రామలింగారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, నల్లమిల్లి అభిమానులు పాల్గొన్నారు.

# ఏపీఈఏపీ సెట్ ఇంజనీరింగ్ పరీక్షలు ప్రారంభం

● ఉమ్మడి జిల్లాలోని 9 కేంద్రాల్లో 96.25 శాతం హాజరు నమోదు

జేఎన్టీయూకే, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఏపీఈ ఏపీసెట్-2025 ఇంజనీరింగ్ ఆన్‌లైన్ ప్రవేశపరీక్షలు బుధవారం కాకినాడ, తూర్పుగోదావరి, డా క్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగాయని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. మూడు జిల్లాల్లో ని 9 కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించామన్నారు. సీబీ ఎస్ఈ, ఐసీఎస్ ఈ, ఏపీవోఎస్ఎస్ ద్వారా ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు ఏపీఈఏపీసెట్ వెబ్ సైట్‌లో డిక్లరేషన్ ఫారంలో తమ మార్కులను ఎంట ర్‌చేస్తే ర్యాంకులు కేటాయిస్తామని తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల ప్రాథమిక 'కీ'ని ముందుగా షెడ్యూల్‌లో ప్రకటించినట్టు కాకుండా ఈనెల 27వ తేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తామన్నారు. కాకినాడ జిల్లాలోని 5కేంద్రాల్లో ఉదయం సెషన్‌లో 888 మంది విదార్థులకు 851మంది హాజరు కాగా 37 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ఇంజనీరింగ్ పరీక్షకు 895మంది విదార్థులకు 868 మంది హాజరు కాగా 27మంది రాయలేదు. రెండు సెషన్లకు కలిపి 96.41శాతం హాజరు నమోదైంది. తూర్పుగోదావరి జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండుసె షన్లకు కలిపి మొత్తం 1000మంది విద్యార్థులకు 967 మంది హాజరుకాగా 33మంది గైర్హాజరయ్యారు. 96.70 శాతం హాజరు నమోదైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లలో 806మంది విద్యార్థులకు 771మంది హాజరుకాగా 35మంది పరీక్ష రాయలేదు. మొత్తం 95.66శాతం విద్యార్థులు హాజరయ్యారు. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు ఈనెల 27వ తేదీ వరకు కొనసాగుతాయని కన్వీనర్ చెప్పారు.

# ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కస్టమ్స్ కమిషనర్ పూజలు

ద్రాక్షారామ, మే 21(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని బుధవారం కస్టమ్స్ కమిషనర్ రమేష్‌కుమార్ రామన్ బుధవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. రమేష్‌కుమార్ రామన్ దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగత ం పలికారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దర్శన అనంతరం నంది మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందుకున్నారు.



భీమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న కస్టమ్స్ కమిషనర్ దంపతులు




తిరంగా యాత్రలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు

# పిఠాపురంలో తిరంగా ర్యాలీ

● మాజీ సైనికులకు సత్కారం

పిఠాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌తో మన సైనిక శక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన సైనికులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ కాకినాడ జిల్లా పిఠాపురంలో బుధవారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. పాదగయ సెంటరువద్ద ప్రారంభ మైనయాత్ర కోటగుమ్మం, మెయిన్‌రోడ్డు, ఉప్పాడ సెంటరు వరకు సాగింది. అక్కడ దేశానికి సేవలు అందించిన మాజీ సైనికులను నాయకులు సత్కరించారు. ఆపరేషన్ సిందూర్ విజయం మన సైనికుల వీరత్వానికి, మనదేశ సార్వభౌమాధికారానికి నిదర్శనమని నాయకులు కొనియాడారు. ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గండి కొండలరావు, దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, వీహెచ్‌పీ నా యకులు డి.వెంకటేశ్వరరావు, సురేంద్ర దత్తు, బీజేపీ, జనసేన నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న ఆభరణాలు తనిఖీ

● బంగారం సుమారు రూ.6కోట్లు, వెండి రూ.2కోట్లు నిర్ధారణ



వెంకన్న ఆలయంలో స్వామివారి ఆభరణాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మే21(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం దేవాదాయ, ధర్మాదాయశాఖ తనిఖీ అధికారి జేవీవో వి.పల్లంరాజు స్వామివారి ఆభరణాలను తనిఖీ చేశారు. వెండి, బంగారు ఆభరణాలను తన సిబ్బందితో లెక్కించారు. ఇప్పటివరకూ స్వామివారికి 163 బంగారు ఆభరణాలు, 303 వెండి ఆభరణాలు ఉన్నట్లు నిర్ధారించారు. బంగారం 7కేజీల 421 గ్రాముల 162మి.లి.గ్రా వీటి విలువ సుమారు రూ.6 కోట్లు, వెండివస్తువులు 183కేజీ339గ్రా 808 మి.లి.గ్రాలు సుమారు రూ.2కోట్లుగా అంచనా వేశారు. ఉదయం నుంచి రాత్రి వరకూ స్వామివారి ఆభరణములు తనిఖీ అధికారులు లెక్కించారు. స్వామివారి వెండి, బంగారు వస్తువులకు ఇన్సూరెన్స్ చేసినట్లు ఆలయ ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వస్తువులు లాకర్లలో భద్రపరచనున్నట్లు తెలిపారు.

# ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రారంభం

కాకినాడరూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్లలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల ప్రక్రియ బుధవారం ప్రారంభమైందని కాకినాడజిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. ఐదేళ్లు సర్వీస్ పూర్తిచేసిన హెచ్‌ఎంలు, ఎనిమిదేళ్లు సర్వీస్ పూర్తిచేసిన స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు తప్పనిసరిగా బదిలీలకు అర్హులన్నారు. అభ్యర్థన బదిలీకోసం ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహిస్తామని డీఈవో చెప్పారు.

# బ్యారేజ్..డామేజ్!

- అస్తవ్యస్తంగా కాటన్ బ్యారేజీ నిర్వహణ
- వెలగని విద్యుత్ దీపాలు
- పెరిగిపోయిన పిచ్చిమొక్కలతో బీటలు
- రహదారిపై గోతులతో ప్రజలకు పాట్లు



పిచ్చిమొక్కలు పెరగడంతో బీటలు వారుతున్న దృశ్యం

బొబ్బర్లంక మెగా వాటర్ ప్రాజెక్టు రహదారిపై గోతులు



బ్యారేజీపై విద్యుత్ దీపాలు వెలగక అంధకారం

బ్యారేజీపై లైట్లు ఊడిపోయి దర్శనమిస్తున్న స్తంభం

ఆత్రేయపురం, మే 21(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న కాటన్ బ్యారేజీ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సర్ఆర్థర్ కాటన్ బ్యారేజీ నిర్మించి ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేశారు. కానీ దీని నిర్వహణ పట్టించుకోకపోవడంతో మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. పిచ్చి మొక్కలు పెరిగిపోయి బీటలు వారుతుంది. వీటిని తొలగించే నాథుడు కరువయ్యాడు. బ్యారేజీ పొడవునా విద్యుత్ దీపాలు వెలగక రాత్రి వేళల్లో ప్రయాణికులు పడరానిపాట్లు పడుతున్నారు. చిమ్మచీకటిలో వెళ్తూ అవస్థలు పడుతున్నారు. ఈ బ్యారేజీ తూర్పుగోదావరి జిల్లా, కోనసీమ జిల్లా పరిధిలోకి విస్తరించి ఉంది. గత ప్రభుత్వ హయాంలో బ్యారేజీ రహదారి అధ్వానంగా మారింది. ప్రయాణం నరకప్రాయంగా ఉండడంతో కూటమి ప్రభుత్వం రహదారిని నిర్మించింది. అయితే ఏడాది గడవకుండానే బొబ్బర్లంక మెగా ప్రాజెక్టు వద్ద రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. వాటిల్లో వర్షాలకు నీళ్లు ఉండిపోయి మరింత పెద్దగా మారుతున్నాయి. ఇరిగేషన్ సిబ్బంది నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో బ్యారేజీ అధ్వాన స్థితికి చేరుకుంది. బ్యారేజీ అందాలను తిలకించేందుకు నిత్యం పర్యాటకులు సందర్శిస్తుంటారు. చరిత్ర గల బ్యారేజీ మనుగడను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.55 కోట్లు



భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా రూ.1,55,04,639 నగదు, 48 గ్రాముల బంగారం, 730 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటుగా యూఎస్ఏకు చెందిన 184 డాలర్లు, యుఏఈ 25 దిరహమ్స్, కెనడా 15తో పాటుగా పలుదేశాల కరెన్సీని భక్తులు హుండీలలో వేశారు. హుండీ లెక్కింపును ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది, సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు. 26 రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరి రోజుకు రూ.5.96 లక్షలు భక్తులు హుండీలలో కానుకల రూపంలో సమర్పించారు.

## కాపవరంలో డీఎల్‌పీవో నాగలత విచారణ

బిక్కవోలు, మే 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కాపవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి సర్పంచ్ వేధిస్తున్నాడంటూ ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. ఈ విషయమై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం డివిజనల్ పంచాయితీ అధికారి నాగలత బుధవారం విచారణ చేపట్టారు. కాపవరం పంచాయితీలో సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులను విచారించారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్ ఉన్నారు.



కాపవరం పంచాయితీలో వార్డు సభ్యులను విచారిస్తున్న డీఎల్‌పీవో నాగలత

## పుష్కరాలకు వెళ్లొస్తూ తిరిగిరాని లోకాలకు..

### లారీ ఢీకొని తల్లికొడుకు మృతి

మరో నలుగురికి తీవ్రగాయాలు

కొత్తగూడెంలో ఘటన, మృతులది కోనసీమ జిల్లా



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు



మృతిచెందిన కనకదుర్గ, వెంకటరత్నం (ఫైల్‌ఫొటోలు)

అంబాజీపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో ఎంతో ఆనందంగా కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు వెళ్లి భద్రాచలంలో దైవ దర్శనం చేసుకుని తిరిగి వస్తున్న ఓ కుటుంబాన్ని మృత్యువు కబళించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం చిరతపూడి గ్రామానికి చెందిన మామిడిశెట్టి వెంకటపతి(ముసలయ్య), భార్య కనకదుర్గ(54), కుమారుడు వెంకటరత్నం(32), కోడలు జ్యోతి స్వరూప, మనమలు దీక్షిత, చేతన్లు ఈనెల 19వ తేదీన రాత్రి తెలంగాణ రాష్ట్రం కాళేశ్వరం పుష్కరాలకు కారులో వెళ్లారు. పుష్కరాల్లో స్నానం చేసి 20వ తేదీన భద్రాచలం రాములవారి దర్శనానికి వెళ్లారు. అనంతరం 20వ తేదీన రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా కొత్తగూడెం వద్దకు వచ్చేసరికి బొగ్గు లోడులారీతో వస్తున్న లారీ కారును బలంగా ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న కనకదుర్గ, వెంకటరత్నం అక్కడిక్కడే మృతిచెందారు. వెంకటపతి, జ్యోతిస్వరూప, దీక్షిత, చేతన్లకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను విజయవాడలో ఓ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో చిరతపూడి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వెంకటరత్నం ఐదు రాష్ట్రాల్లో మెటల్ఎన్డీపీ అండ్ ఇన్‌స్పెక్షన్ సర్వీసు పార్టనర్‌గా ఉన్నారు. అందరితో కలిసిమెలిసి ఉంటూ ఆప్యాయంగా పలకరించే వెంకటరత్నం మృతిని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. కనకదుర్గ, వెంకటరత్నం మృతదేహాలను చిరతపూడి తీసుకువచ్చారు. వారి మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేసి కుటుంబసభ్యులను ఓదార్చారు.

## కోనసీమలో 3వేల సీసీ కెమెరాలు

- మహిళలపై జరిగే నేరాలను గుర్తించడానికి 6 జిల్లాల్లో ప్రత్యేక టీములు
- ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీ



మలికిపురంలో విలేకర్లతో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

మలికిపురం, మే 21(ఆంధ్రజ్యోతి): నేరాల అదుపునకు పోలీసులు నూతన టెక్నాలజీని ఉపయోగించి చాలా ఫలితాలు సాధించినట్టు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ముఖ్య కూడళ్లలో ఇప్పటికే 3వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. బుధవారం మలికిపురం పోలీసుస్టేషన్ సందర్శనకు వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. నేరాల దర్యాప్తు, పరిశోధనలలో కెమెరాలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయన్నారు. ఈ మధ్య కాలంలో జరిగిన నేరాలు, దొంగతనాలను, నేరస్తులను గుర్తించడానికి సీసీ కెమెరాలు చాలా దోహదపడ్డాయన్నారు. పలు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, వర్తక సంఘాలు, దాతలు ముందుకు వస్తున్నారని ప్రశంసించారు. గ్రామాల్లో నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసుకునేవారు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. మలికిపురం పోలీసుస్టేషన్ పరిధిలో క్రైమ్ రేటు తక్కువగా ఉందన్నారు. సీసీ కెమెరాల ద్వారా అమలాపురం వంటి ప్రాంతాల్లో దేవాలయాల్లో దోపిడీలు చేసినా శ్రీకాకుళం గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. జిల్లాలో గంజాయి నేరాలు తగ్గాయని, ఈ కేసుల్లో పాత నేరస్తులపై నిఘా ఉంచి కట్టడి చేస్తున్నామని వీటి కోసం ఈగల్ బృందాలు పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. గల్ఫ్ వెళ్లేవారు ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటున్నారని, మోసాలకు గురవుతున్నారని, లైసెన్సు కలిగిన ఏజెంట్ల ద్వారా విదేశాలకు వెళ్లేలా అవగాహన కల్పిద్దామన్నారు. మహిళలపై జరిగే నేరాలపై వెంటనే స్పందించి ప్రత్యేక బృందాల ద్వారా గుర్తించి వారికి వెంటనే శిక్షలు పడేలా ఏలూరు రేంజ్ పరిధిలోని 6జిల్లాల్లో ప్రత్యేక టీములు పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు.

### మహిళల కోసమే శక్తి యాప్

ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించామని, రోడ్ సేఫ్టీ సమావేశాల్లో ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎక్కువ ప్రమాదాలు రోడ్లపై నిలిపి ఉంచిన వాహనాల ద్వారా జరుగుతున్నాయని, రోడ్లపై వాహనాలు నిలిపి ఉంచకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం శక్తి యాప్ ప్రవేశపెట్టిందని, నేరాలకు పాల్పడే వారిని గుర్తించి వారిపై చర్యలు వెంటనే తీసుకోనున్నట్టు తెలిపారు. మలికిపురం స్టేషన్‌లో రికార్డులను ఐజీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా ఆయనకు జిల్లా ఎస్పీ కృష్ణారావు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఐజీ పోలీసు వందనాన్ని స్వీకరించారు. మలికిపురం ఎస్ఐ పి.సురేష్‌కి మొక్క అందజేసి స్వాగతం పలికారు. సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ నగేష్ కుమార్, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్ అదుపుతప్పి వ్యక్తి మృతి



షేక్ నాగూర్ (ఫైల్)

గండేపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు మీద పడి వ్యక్తి మృతిచెందాడు. గండేపల్లి ఎస్ఐ శివ నాగ బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా గండేపల్లికి చెందిన షేక్ నాగూర్ (57) గండేపల్లి నుంచి అతడు డ్రైవర్‌గా పనిచేస్తున్న గైట్ కాలేజీకి బుధవారం మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మురారి గ్రామ శివారున దాబా ఎదురుగా వచ్చేసరికి మోటార్ అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. బంధువులు గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేశారు.

## పురుగుల మందు తాగి...



సింహాద్రి(ఫైల్)

అంబాజీపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి వ్యక్తి మృతిచెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన రంకిరెడ్డి సింహాద్రి (40) సమస్యలతో మనస్తాపానికి గురై ఈనెల 20న మొసలపల్లి శివారు కొబ్బరి తోటల్లో పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో అతడిని అమలాపురం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతడికి భార్య జ్యోతి, కుమార్తె కీర్తి, కుమారుడు శ్రీరామ్ ఉన్నారు. ఈ విషయంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు.

## ఆసుపత్రికి వెళ్లొస్తుండగా..

### కారు ఢీకొని మహిళ మృతి



ప్రమాదంలో మరణించిన మాణిక్యం



ఫైల్‌ఫొటో

రాజానగరం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని తిరిగి వస్తూ రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కలవచర్ల గ్రామానికి చెందిన యర్రా మాణిక్యం (54) వైద్య పరీక్షలు నిమిత్తం మనుమరాలు అంజలి సహాయంతో బుధవారం రాజానగరం సమీపంలో జీఎస్ఎల్ ఆసుపత్రికి వెళ్లారు. వైద్య పరీక్షలు చేయించుకుని తిరిగి వస్తూ ఆసుపత్రి వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కారు మాణిక్యాన్ని బలంగా ఢీకొని మీద నుంచి వెళ్లింది. ఇదే సమయంలో వెనుక వైపు వస్తున్న మరో కారు, ప్రమాదానికి కారణమైన కారును ఢీకొంది. దీంతో బలమైన గాయాలు కావడంతో మాణిక్యం అక్కడికక్కడే మృతిచెందింది. మనుమరాలు అంజలి ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడింది. మాణిక్యానికి కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కలవచర్ల జనసైనికులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం త్వరితగతిన చేపట్టేలా సహాయ సహకారాలు అందించారు. రాజానగరం ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రూ.500 నకిలీ నోట్లతో ఇద్దరి అరెస్ట్

### అంగర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



అంగర పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐ

కపిలేశ్వరపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): రూ.500 నకిలీ నోట్లను చెలామణి చేస్తున్న ఇద్దరు నిందితులను మండపేట రూరల్ సీఐ దొరరాజు పట్టుకున్నారు. ఈ మేరకు బుధవారం కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను సీఐ దొరరాజు, అంగర ఎస్ఐ రవికుమార్ విలేకర్లకు వెల్లడించారు. మంగళవారం అంగర రైస్ మిల్లు ఎదురుగా ఉన్న కిళ్లీ షాపులో రాజమహేంద్రవరానికి చెందిన మన్యం వీరవెంకట సత్యసీతారామారావు రూ.500 నోటు ఇచ్చి సిగరెట్ బాక్స్ కొన్నాడు. ఆ నోటును చూసి అనుమానం వచ్చిన షాపు యజమాని కసెట్టి సత్యనారాయణ స్థానికుల సాయంతో నిందితుడిని అంగర పోలీసులకు అప్పగించారు. అతడు ఇచ్చిన సమాచారంతో విజయవాడలోని మరో నిందితుడు వారా నవీన్‌ను పట్టుకుని అతడి నుంచి 44 నకిలీ రూ.500 నోట్లను, ల్యాప్‌ట్యాప్, కలర్‌ప్రింటర్, 17ఎగ్జిక్యూటివ్ బాండ్ పేపర్లు, పెన్‌డ్రైవ్, మోటార్ సైకిల్‌ను స్వాధీన పర్చుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించనున్నట్టు సీఐ దొరరాజు తెలిపారు.

## హైస్కూల్‌లో చోరీ చేసిన ఇద్దరి అరెస్ట్

శంఖవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం హైస్కూల్‌లో చోరీకి పాల్పడ్డ నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ శ్రీహరిబాబు వారి వివరాలను వెల్లడించారు. శంఖవరం గ్రామానికి చెందిన గామాల అశోక్, బోడపాటి చిన్నోడు స్థానిక హైస్కూల్‌లో కంప్యూటర్లు, ప్రింటర్‌తో పాటు మంచినీటిని శుద్ధిచేసే యంత్రం పార్టులను చోరీ చేశారు. బుధవారం ఉదయం నెల్లిపూడి శివారు బెండపూడి అడ్డురోడ్డులో నిందితులను ఆటోతో పాటు అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



కాకినాడ జిల్లా శంఖవరంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

## కాకినాడ జీజీహెచ్‌లో ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

జీజీహెచ్ (కాకినాడ), మే 21 (ఆంధ్రజ్యోతి): తప్పుడు మెడికల్ సర్టిఫికెట్ సృష్టించి ఇచ్చిన వ్యవహారంలో నిజం నిగ్గు తేలడంతో కాకినాడ జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.... కాకినాడ ఆర్టీసీ పరిధిలో కండక్టర్‌గా పనిచేస్తున్న బుద్దాల వెంకన్న వివాదాస్పదుడు. డిపోలోని ఉన్నతాధికారులతో గొడవపడడంతో అతడిపై కోర్టులో కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో వెంకన్న పలు పర్యాయాలు కోర్టు వాయిదాకు హాజరుకాలేదు. దాంతో అతడిపై 2024లో వారెంట్ జారీ అయ్యింది. అయితే వెంకన్న కోర్టు వాయిదాలకు హాజరు కాని సమయంలో మెడికల్ సర్టిఫికెట్ కోర్టుకు, డిపోకు సమర్పిద్దామని పథకం పన్నాడు. ఈ క్రమంలో వెంకన్న జీజీహెచ్‌కు వచ్చి ఆర్థో విభాగంలోని కట్లు కట్టే చోట అనధికారికంగా సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న సత్యగురు అనే వ్యక్తిని కలిశాడు. తనకు మెడికల్ సర్టిఫికెట్ కావాలని, డబ్బులు ఇస్తానని చెప్పాడు. దాంతో సత్యగురు నడుంనొప్పి అని చెప్పి ఓపీ టికెట్ తీసుకుని రమ్మన్నాడు. అనంతరం ఆర్ఎంవో దగ్గరకు వెళ్లి పాత తేదీల్లో మెడికల్ సర్టిఫికెట్ కావాలని అభ్యర్థించగా ఆమె తిరస్కరించారు. దాంతో సత్యగురు మరో పథకం పన్ని రెగ్యులర్ జూనియర్ అసిస్టెంట్‌లుగా పని చేస్తున్న బి.సత్యనారాయణ, ఎం.ఉమామహేశ్వరరావు నీ పని చేయిస్తారని డబ్బులు తెమ్మన్నాడు. డబ్బులు ఇచ్చిన వెంటనే వారిద్దరూ అదే రోజు మెడికల్ సర్టిఫికెట్‌ను వెంకన్నకు అందజేశారు. ఆ సర్టిఫికెట్‌ను వెంకన్న ఒక కాపీ డిపో మేనేజర్‌కు, మరో కాపీ కోర్టుకు సమర్పించాడు. అయితే ఉద్యోగ రీత్యా వెంకన్న వివాదాస్పదుడైన నేపథ్యంలో అనుమానం వచ్చి ఆ సర్టిఫికెట్‌ను జన్యూనిటీ కోసం డిపో మేనేజర్ జీజీహెచ్‌కు పంపారు. ఆ సర్టిఫికెట్‌ను పరిశీలించిన జీజీహెచ్ అధికారులు ఆ సంతకాలు, ఆ స్టాంపులు జీజీహెచ్‌కు సంబంధించినవి కావని నిర్ధారించి డిపో మేనేజర్‌కు అధికారికంగా తెలియపరిచారు. ఆ నివేదిక ఆధారంగా వెంకన్నను ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగించారు. ఈ వ్యవహారం అంతా ఏడాది పొడవునా సాగింది. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరిలో వెంకన్న జీజీహెచ్ అధికారులు తనపై తప్పుడు నివేదిక ఇచ్చారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును పరిశీలించాల్సిందిగా కలెక్టర్ జీజీహెచ్ అధికారులకు సిఫార్సు చేశారు. దాంతో ఆసుపత్రి అధికారులు ఒక కమిటీ వేసి విచారణ చేసి 100 శాతం ఆ సర్టిఫికెట్ నకిలీదిగా నిర్ధారించారు. ఆ నివేదికను కలెక్టర్‌కు పంపడమే కాకుండా ఈ వ్యవహారానికి మూలం ఎవరు అనే దానిపై విచారించి. జూనియర్ అసిస్టెంట్‌లైన సత్యనారాయణ, ఉమామహేశ్వరరావులపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే అనధికారికంగా జీజీహెచ్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న సత్యగురుపై పోలీస్‌చర్యలకు అధికారులు ఉపక్రమిస్తున్నారు.

## ఉద్యోగాలిప్పిస్తామని మోసం

### రాజోలులో ముగ్గురిపై కేసు నమోదు

నిందితుల్లో ఇద్దరు అమలాపురం మాజీ ఎంపీ అనురాధ పీఏలు

రాజోలు, మే 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేశామని రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం పొన్నమండకు చెందిన మోకా రాజబాబు కుమారుడు దిలీప్‌కుమార్, మరో నలుగురు నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రాజోలు మండలం ములికిపల్లికి చెందిన ఎం.రాంబాబు ద్వారా అప్పటి అమలాపురం ఎంపీ చింతా అనురాధ వద్ద పీఏలుగా పనిచేసిన కె.చరణ్, కె.శ్రీకాంత్ వద్దకు 2021వ సంవత్సరంలో తీసుకువెళ్లారు. స్మార్ట్ విలేజ్, ఓఎన్జీసీ, అగ్రికల్చరల్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగాలు ఇప్పించి ఉపాధి కల్పిస్తామని నమ్మించారు. ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ.లక్షా 50వేల చొప్పున డబ్బులు వసూలు చేశారు. నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి మోసం చేశారు. కొంత కాలానికి అవి నకిలీవని తేలడంతో తమ డబ్బులు తిరిగి ఇచ్చేయాలని బాధితులు కోరారు. డబ్బులు తిరిగి ఇవ్వక వేరొక ఉద్యోగం వేయిస్తామని చెబుతూ కాలయాపన చేశారు. దీంతో రాజోలు పోలీసుస్టేషన్‌లో అడబాల క్రాంతి, లింగమూర్తి, జిల్లెల్ల వంశీ, ఎస్.విజయ్‌కుమార్, ఎస్.విజయ్‌కుమార్, పి.దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.చరణ్, కె.శ్రీకాంత్, ఎం.రాంబాబులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

## అన్నవరంలో యోగాసనాలు

అన్నవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో నెలరోజులపాటు భక్తులు, ఉద్యోగులతో యోగాసనాలు వేయించి వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని బుధవారం నుంచి అన్నవరం దేవస్థానం చేపట్టింది. నెలరోజులు పాత నిత్యకల్యాణమండపంలో ఈ యోగాసనా ల కార్యక్రమం చేపట్టనున్నట్టు ఈవో సుబ్బా రావు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ రోహిత్, దేవస్థానం ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.



సత్యదేవుడి సన్నిధిలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

## 8 ఇసుక లారీల సీజ్

కె.గంగవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం - కోటిపల్లి రహదారిలో బుధవారం ఏవిధమైన అనుమతులు లేకుండా తరలిస్తున్న 8 ఇసుక లారీలను అదుపులోకి తీసుకున్నారు. పామర్రు ఎస్.ఐ. ఎస్.కె.జానీబాషా చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. మైనింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు బృందం తనిఖీల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు తెలిసిందని, దీంతో మైనింగ్ అధికారిణి సుజాత ఎనిమిది ఇసుక లోడ్ లారీలను సీజ్ చేసి తమకు కస్టడీకి అప్పగించారని పేర్కొన్నారు. ఇవి కపిలేశ్వరపురం మండలంలోని ఇసుక ర్యాంపుల నుంచి వస్తున్నట్టు తెలిసింది.

## నేడు గొల్లప్రోలులో రక్తదాన శిబిరం

గొల్లప్రోలు, మే 21 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని నూతన తహసీల్దారు కార్యాలయ ఆవరణలో తలసీమియా చిన్నారుల కోసం గురువారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు సత్యనారాయణ తెలిపారు. పంచాయతీరాజ్, నగర పంచాయతీ, రెవెన్యూ సహా అన్ని శాఖల ఉద్యోగుల సహకారంతో ఉదయం ఎనిమిది గంటలకు శిబిరాన్ని ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.

## గండేవారి కాలువపై రూ.9.80 లక్షలతో బ్రిడ్జి

» తక్షణం చర్యలు తీసుకోవాలి » అధికారులకు కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశం



గండేవారికాలువపై బ్రిడ్జి ఆవశ్యకతను కలెక్టర్ షాన్‌మోహన్‌కు వివరిస్తున్న జనసేన నాయకుడు తమ్మయ్యనాయుడు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గొల్లప్రోలు, మే 21 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణ శివారులోని గండే వారి కాలువపై రూ.9.80 లక్షలతో బ్రిడ్జి నిర్మాణానికి తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. గండే వారి కాలువపై పొలాలకు వెళ్లడానికి రైతులు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ 'తాటిబద్దలే ఆధారం' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై జనసేన నాయకుడు కడారి తమ్మయ్యనాయుడు, మొగలి రామ్మూర్తిలతో పాటు రైతులు కలెక్టర్‌ను కలిసి వంతెన ఆవశ్యకతను వివరించారు. తక్షణం పనులు చేపట్టి వ్యవసాయ సీజను ప్రారంభమయ్యేలోగా పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఐదు వేల ఎకరాల్లో రైతులకు ప్రయోజనకరంగా ఉండేందుకు గొల్లప్రోలు-సీతానగరం-లక్ష్మీపురం-మల్లవరం గ్రామాల మధ్య పుంతరోడ్డు నిర్మాణం చేపట్టాలని నాయకులు, రైతులు కలెక్టర్‌ను కోరారు. ఇప్పటికే ఉపాధి నిధులతో చేపట్టే పనులకు అంచనాలు రూపొందించామని, గొల్లప్రోలు పరిధిలో పనులకు ప్రత్యేకంగా అంచనాలు రూపొందించి ప్రభుత్వం నుంచి ఆమోదం తీసుకోవాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. ఉపాధి నిధులతో చేపట్టే పనులను తక్షణం ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



పిఠాపురంలో ఏకధాటిగా కురుస్తున్న వర్షం

## పిఠాపురంలో కుండపోత వర్షం

» ఎక్కడికక్కడ నిలిచిపోయిన నీరు » పొంగిపొర్లిన డ్రైన్లు

పిఠాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో బుధవారం కుండపోత వర్షం కురిసింది. ఆకాశానికి చిల్లుపడినట్లుగా గంటన్నర పాటు కురిసిన వర్షంతో డ్రైన్లు, రహదారులు ఏకమయ్యాయి. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందిపడ్డారు. అరేబియా సముద్రంలో అల్పపీడనం, బంగాళాఖాతం మీదుగా ఉపరితల ద్రోణి ఆవరించి ఉన్న నేపథ్యంలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. పిఠాపురం, పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి ఉక్కపోత వాతావరణం, స్వల్పంగా చినుకులు పడుతూనే ఉన్నాయి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో డ్రైన్లు పొంగిపొర్లి రోడ్లపై నీరు ప్రవహించింది. ప్రభుత్వాసుపత్రి, ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలతో పాటు పాత పోలీస్ స్టేషన్ సెంటర్, అన్న క్యాంటీన్, సినిమా సెంటర్, ఉప్పాడ సెంటర్, అంబేద్కర్ సెంటర్, చర్చి సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్సు సహా అన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. మధ్యాహ్నం 3గంటల వరకు స్వల్పంగా వర్షం పడుతూనే ఉండడంతో వారికి అవస్థలు తప్పలేదు. అన్న క్యాంటీన్ చుట్టూ భారీగా నీరు నిలిచిపోవడంతో అందులోంచే భోజనాలు చేసేందుకు ప్రజలు వెళ్లారు.

**గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి):** గొల్లప్రోలు పట్టణం, మండలంలోని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. గొల్లప్రోలు, తాటిపర్తి, దుర్గాడ తదితర ప్రాంతాల్లోని రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. ప్రజలు నీటిలో నుంచే రాకపోకలు సాగించారు.

**కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి):** మండలంలోని తీర గ్రామాల్లో అడపాదడపా వర్షం కురుస్తోంది. ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు రావట్లేదు. బుధవారం సాయంత్రం ఉప్పాడ వద్ద సముద్రంలో కెరటాలు సాధారణంగా ఒడ్డుకు చేరుతున్నాయి. గురువారం సాయంత్రానికి శక్తి తుఫాను ప్రభావం కనిపిస్తుందని మత్స్యకార పెద్దలు చెప్తున్నారు.

**సామర్లకోట (ఆంధ్రజ్యోతి):** సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాల్లో బుధవారం మోస్తరు స్థాయిలో వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊరట చెందారు. రోజువారీ పనులు సాఫీగానే జరిగినా ఉపాధి హామీ పనులకు తీవ్ర ఆటంకం కలిగింది. కూలీల హాజరు అంతంతమాత్రంగానే ఉంది.





డ్రైన్లు పొంగిపొర్లడంతో పిఠాపురంలో రహదారిపైకి చేరిన వర్షపు నీరు, అన్నక్యాంటీన్ వద్ద వర్షపు నీరు ప్రవహిస్తున్న దృశ్యం



కొత్తపల్లి సురక్ష హాస్పిటల్‌లో రక్తదానం చేస్తున్న దృశ్యం

## కొత్తపల్లిలో రక్తదాన శిబిరం

కొత్తపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): తలసీమియా చిన్నారుల కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తపల్లి సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు, యువకులు సుమారు 53 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ అధినేత, జనసేన వైద్య విభాగం ప్రతినిధి డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, తహసీల్దారు జి.చిన్నారావు, ఎంపీడీవో పి.రవికుమార్, డిప్యూటీ తహసీల్దారు డీవీ మురళీకృష్ణ, ఆర్‌ఐ మధుసూదనరావు, ఏఎస్‌వో బండి అప్పలరాజు, పలువురు వీఆర్వోలు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## 'అధ్యాపకులు బోధనలో సాంకేతికత జోడించాలి'



ఎఫ్‌డీపీ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సుగుణారెడ్డి

కాకినాడ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు బోధనలో సాంకేతికత జోడించినప్పుడే విద్యార్థులకు ఆ పాఠం ఉపయోగపడుతుందని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల కార్యదర్శి ఎన్.సుగుణారెడ్డి అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్లో బుధవారం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. మొదటి విడత ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుగుణారెడ్డి మాట్లాడుతూ ఎఫ్‌డీపీలో డిగ్రీ సిలబస్‌తో పాటు ప్రపంచ జ్ఞానానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని నిపుణులతో ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ చేశామన్నారు. సబ్జెక్టు డీన్స్, వివిధ శాఖల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.





ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, ఎమ్మెల్సీ రాజశేఖరం, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి, కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), మినీ మహానాడులో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

## టీడీపీకి కాకినాడ రూరల్ కంచుకోట

» కార్యకర్తలే పార్టీకి సుప్రీం » కష్టపడిన వారికి ఏ అవసరం వచ్చినా న్యాయం చేస్తా: టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

సర్పవరం జంక్షన్, మే 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ మినీ మహానాడు బుధవారం సర్పవరం జంక్షన్‌లోని స్పందన ఫంక్షన్ హాల్లో కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ పరిశీలకుడు కుడుపూడి సత్తిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొత్తులో భాగంగా నియోజకవర్గంలో కొన్ని ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని, ఇన్‌చార్జి లేక నాయకులు, కార్యకర్తల నడుమ అంతరం ఏర్పడుతోందని, మహానాడు అనంతరం ఈ విషయమై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని సత్తిబాబు తెలిపారు. కష్టకాలంలో నాయకులు పెంకే శ్రీనివాసబాబా, పేరాబత్తుల రాజశేఖరం, కటకంశెట్టి బాబీ వెన్నంటి ముందుకు నడిపించారని కితాబిచ్చారు. కాకినాడ రూరల్ టీడీపీకి కంచుకోట అని, కార్యకర్తలే పార్టీకి సుప్రీం అని, కష్టపడి పనిచేసిన వారికి ఏ అవసరం వచ్చినా న్యాయం చేసేందుకు ముందుంటానని పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తెలిపారు. పొత్తులో భాగంగా జనసేనకు టిక్కెట్ కేటాయిస్తే పార్టీ క్యాడర్ అంతా కలిసి పవన్ కల్యాణ్ కంటే అత్యధిక మెజారిటీ వచ్చేలా కృషి చేస్తే, సదరు ఎమ్మెల్యే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలను ఏ మాత్రం భాగస్వాములు చేయట్లేదని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 3,010 కిలోమీటర్లు పాదయాత్ర చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో కీలకంగా వ్యవహరించిన నారా లోకేశ్‌ను పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేయాలని నాయకులంతా డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని ప్రధాన అంశాలను మినీ మహానాడులో చర్చించి కడపలో జరిగే మహానాడుకు పంపించేందుకు తీర్మానం చేశారు. ఎస్సీ గౌడ కార్పొరేషన్ల డైరెక్టర్లు కొల్లాబత్తుల అప్పారావు, ఎం.ప్రకాశ్‌గౌడ్, సీనియర్ నాయకులు పెంకే శ్రీనివాసబాబా, వాసిరెడ్డి ఏసుదాసు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, కొజు నెహ్రూ, పితాని అప్పన్న, మనుమేను గంగయ్య తదితరులు పాల్గొన్నారు

> బడుగు, బలహీన, అట్టడుగు, నిరుపేద వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పరిపాలన సాగించారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనా దక్షతతో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించేలా కృషి చేస్తున్నారు.
>
> మినీ మహానాడులో టీడీపీ నాయకులు



శంకుస్థాపన చేస్తున్న రంగనాగ్

## సత్తెమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

సామర్లకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): ఏపీబీసీఎల్ ఆవరణలో సత్తెమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఐఎంఎల్ డిపో హమాలీల యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, ఐఎంఎల్ డిపో మేనేజరు కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

## 'దేశానికి సాంకేతికత తీసుకొచ్చింది రాజీవ్ గాంధీయే'

కాకినాడ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): దేశానికి సాంకేతికతను తీసుకొచ్చింది రాజీవ్ గాంధీయేనని ఏఐసీసీ మెంబర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్కా నూకరాజు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ సభ్యుడు పోలిశెట్టి శ్రీనివాసరావు, డీసీసీ ఉపాధ్యక్షుడు పబ్బినీడి కృష్ణ, నాయకులు దవులూరి ధనకోటి, కంభం రాజబాబు, వరిపల్లి చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

**పిఠాపురం (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ఇందిరానగర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి గంటా సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాశరావు, పుణ్యమంతుల నందగణేష్, మొగలి వెంకట సూర్యనారాయణరావు, బులిపే జయరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొండబాబును గజమాలతో సత్కరిస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

## గ్రీన్ ట్యాక్స్ తగ్గింపుపై హర్షం

కాకినాడ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ప్రభుత్వం గ్రీన్ టాక్స్ తగ్గించడంపై కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సంజయ్‌నగర్‌లోని లారీ అసోసియేషన్ కార్యాలయానికి విచ్చేసిన సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును గజమాలతో సత్కరించారు. అనంతరం సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే సమక్షంలో యూనియన్ నాయకులు, లారీల యజమానులు పాలాభిషేకం చేసి స్వీట్లు పంచారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గూడవల్లి మృత్యుంజయరావు, కార్యదర్శి అల్లం రాజు, కోశాధికారి గీసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం గ్రీన్ ట్యాక్స్ తగ్గించడం ఆనందకర మన్నారు. అసోసియేషన్ నాయకులు ప్రతినిధులు అడిగర్ల గంగబాబు, కుచర్లపాటి అర్జున్‌రాజు, చిట్టిమేను సత్యనారాయణ, ఊద శ్రీను, యలమంచిలి సత్తిబాబు, కాండ్రేగుల సతీష్, నల్లి సూర్యరామ్మోహనరావు, ముదునూరి సతీష్‌రాజు, తానారి గంగాధర్, నక్కా గీతాప్రసాద్, టీడీపీ నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, గుమ్మళ్ల చిన్న, మూగు రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్యామ్ కుటుంబానికి రూ.10వేలు సాయం



శ్యామ్ కుటుంబానికి నగదు అందజేస్తున్న జనసేన నాయకులు

కొత్తపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ నాయకర్ కాలనీకి చెందిన మేరుగు శ్యామ్ బోటుపై వేటకు వెళ్లి గల్లంతైన సంగతి విదితమే. తన అనుచరుల ద్వారా సమాచారం తెలుసుకున్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ శ్యామ్ కుటుంబానికి రూ.10వేల నగదును కాకినాడ జీజీహెచ్ డెవలప్‌మెంట్ కమిటీ డైరెక్టర్ రావు అక్షయ్ ద్వారా బుధవారం పంపించారు. ఎంపీ అభ్యర్థన మేరకు శ్యామ్ ఆచూకీ కోసం కలెక్టర్ ఆదేశాలతో కోస్ట్ గార్డులతో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారని అక్షయ్ తెలిపారు. జనసేన నాయకులు వాద్ర దనబాబు, వంకా కొండబాబు, చవాకుల రమణ, సానా నాగు, మైలపల్లి రాజు, మామిడాల సూరిబాబు, చొక్కా సంజీవ్, మేరుగు జగదీష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.





సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ శ్రీనివాసరావు

## 'గృహాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి'

గొల్లప్రోలు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): గృహాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.శ్రీనివాసరావు సూచించారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎమినిటీస్ సెక్రటరీలు, ఏపీఎంలు, మహిళా సంఘాల ఆర్పీలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లో వివిధ దశల్లో నిలిచిపోయిన గృహాలను గుర్తించి వాటిని జూన్ నెలాఖరులోపు పూర్తి చేయించాలన్నారు. హౌసింగ్ డీఈఈ ఎల్.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ కుమార్, టౌన్, రూరల్ ఏఈలు రాజేశ్వరి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నేడు హనుమత్ జయంతి

సామర్లకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): కంచి మహాసంస్థానం ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం వద్ద గురువారం హనుమజ్జయంతి నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక కుటుంబీకుడు చంద్రాభట్ల పతంజలి పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు సంకల్పం, మహన్యాస పారాయణ, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, సూక్త పారాయణ, సాయంత్రం 4 గంటలకు సహస్ర నామార్చన, ప్రసన్నాంజనేయ స్వామికి 60 అడుగుల ఎత్తు నుంచి శిరస్సు మీదుగా పుష్పాభిషేకం, తమలపాకులతో అభిషేకం, నీరాజన మంత్రపుష్పాలు, వేదాశీర్వచనం, దర్బారు సేవ జరుగుతాయని చెప్పారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

## పెద్దాపురం మున్సిపల్ కమిషనరుగా శ్రీకాంత్‌రెడ్డి

పెద్దాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మున్సిపల్ కమిషనరుగా కె.శ్రీకాంత్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ కార్పొరేషన్ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం పెద్దాపురం కమిషనరుగా వున్న కేవీ పద్మావతిని కమిషనరు అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో రిపోర్ట్ చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌రెడ్డికి మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డుతులసిమంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ కంట్రోలర్ జనార్దన్, సలీం, శ్రీనివాసరావు

## లీగల్ మెట్రాలజీ పోస్టర్ ఆవిష్కరణ

కార్పొరేషన్ (కాకినాడ), మే 21 (ఆంధ్రజ్యోతి): లీగల్ మెట్రాలజీ డే సందర్భంగా తూనికలు, కొలతల శాఖ సూచనల పోస్టర్‌ను కాకినాడ లీటల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ జనార్దన్ బుధవారం ఆవిష్కరించారు. అసిస్టెంట్ కంట్రోలర్ సలీం. వినియోగదారుల సమాఖ్య జాయింట్ సెక్రటరీ, డీసీపీసీ మెంబర్ కొమ్మూరి శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జగనన్న కాలనీలో ఆందోళనకు దిగిన మహిళలు

## తాగునీటి కోసం మహిళల ఆందోళన

తాళ్లరేవు, మే 21 (ఆంధ్రజ్యోతి): నీలపల్లి జగనన్న కాలనీలో తాగునీరులేక ఇబ్బంది పడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవట్లేదని పలువురు మహిళలు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో కనీస సౌకర్యాలు లేకున్నా సమాధానం చెప్పేవారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి మినరల్ వాటర్ బాటిల్స్ కొనుగోలు చేసుకుంటున్నామన్నారు. పంచాయతీ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా సమస్య పరిష్కారం కాలేదన్నారు.

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలేశ్వరం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ వీరభద్రరావు తెలిపారు. విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్లు, తుప్పలు, పొదులు తొలగించడంలో భాగంగా కొండతిమ్మాపురం, లింగంపర్తి, భద్రవరం, రమణయ్యపేట, మార్కండేయపురం, తూర్పులక్ష్మీపురం, గొంటువానిపాలెం, కిమ్మూరు, మాల్సపాకలులో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

# రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



మోతుగూడెం మసీదు వీధిలో సమస్యలపై చర్చిస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ తదితరులు

## మోతుగూడెం అభివృద్ధికి కృషి : పీవో

మోతుగూడెం, మే 21(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం గ్రామాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో అపూర్వభరత్ అన్నారు. మోతుగూడెం ఏపీ జెన్కో అతిథి గృహంలో బుధవారం మోతుగూడెం పంచాయతీ అభివృద్ధిపై స్థానిక ఏపీ జెన్కో, ప్రభుత్వ శాఖల విభాగాల అధికారులు, స్థానిక ఎంపీటీసీలు, పీసా కమిటీ సభ్యులు, గ్రామస్తులతో ఐటీడీఏ పీవో అపూర్వభరత్ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో స్థానిక ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, పలు సమస్యలను పీవో దృష్టికి తీసుకొచ్చారు. గ్రామపంచాయతీ అభివృద్ధికి ఏపీ జెన్కో ద్వారా సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు. గృహ నిర్మాణ, తాగునీటి, ఉపాధి హామీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం పీవో అపూర్వభరత్ మోతుగూడెంలో వివిధ ప్రాంతాలను సందర్శించి సమస్యలను గుర్తించారు. సమస్యల పరిష్కారానికి పీసా కమిటీల ద్వారా తీర్మానాలు చేసి పంపాలని సూచించారు. జెన్కో సహాయంతో మోతుగూడెం పంచాయతీని అభివృద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామని పీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ చిరంజీవి, ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ స్వామి నాయుడు, సివిల్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఎంపీడీవో రామకృష్ణ, లక్కవరం రేంజర్ నానాజీ, ఎస్ఐ సాదిక్, మోతుగూడెం వైద్యుడు ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

## మన్యంలో విద్యాభివృద్ధికి చర్యలు



కస్తూరిబా జూనియర్ కళాశాల విస్తరణ పనుల శంకుస్థాపనలో పాల్గొన్న కలెక్టర్ దినేష్, ఎమ్మెల్యే శిరీష

రంపచోడవరం, మే 21(ఆంధ్రజ్యోతి): మన్యంలో విద్యాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో సమగ్ర చర్యలు చేపడుతున్నామని అల్లూరి జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ తెలిపారు. బుధవారం రంపచోడవరంలోని కస్తూరి ఆశ్రమ జూనియర్ కళాశాల భవన విస్తరణ పనులకు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవితో కలిసి ఆయన శంఖుస్థాపన చేశారు. రంపచోడవరం డివిజన్‌లో రంపచోడవరం, మారేడుమిల్లి, గంగవరం మండలం నెల్లిపూడి, రాజవొమ్మంగిలలోని కస్తూరిబా జూనియర్ కళాశాలల్లో అదనపు తరగతి గదుల భవనాల కోసం సర్వ శిక్షాభియాన్ ద్వారా ఒక్కో భవనానికి రూ.1.60కోట్లు చొప్పున నిధులు కేటాయించారన్నారు. నాణ్యత ప్రమాణాలతో ఈభవనాలను త్వరితగతిని పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, జడ్పీటీసీలు పి.వెంకటలక్ష్మి, పల్లాల కృష్ణారెడ్డి, ఎంపీపీ బంద శ్రీదేవి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సలాది బాపిరాజు, తెలుగుదేశం నాయకులు ఎ.బాపిరాజు, వై. నిరంజనీదేవి, పెంటపాటి మోహన్, పి.చెల్లన్న దొర, ఎంపీడీవో శ్రీనివాసదొర, సర్వశిక్షాభియాన్ ప్రాజెక్టు అధికారి వీఎస్ స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు

## మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళి

మోతుగూడెం, మే 21(ఆంధ్రజ్యోతి): చింతూరు రాజీవ్‌గాంధీ సెంటర్‌లో బుధవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. అక్కడనున్న రాజీవ్ విగ్రహానికి కాంగ్రెస్ కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి షేక్‌అష్వాద్‌ఆలీ, నాయకులు జవహర్, బొక్కిలి నాగేశ్వరరావు, అక్బర్, బొక్కిలి ప్రసాద్, నరేష్, కన్నారావు, కృష్ణ, భూషణం తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



అమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది తదితరులు

## అమ్మవారి హుండీ ఆదాయం రూ.6 లక్షలు

దేవీపట్నం, మే 21(ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో మండల పరిధిలోనున్న గండి పోశమ్మ అమ్మవారి హుండి ఆదాయం లెక్కించారు. పది నెలలకు రూ.6,42,563 ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయ శాఖ రాజమహేంద్రవరం ఇన్‌స్పెక్టర్ టి.ప్రసాద్, వంగలపూడి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ మనోజిత్ సర్కార్, పోలీస్ సిబ్బంది, వంగలపూడి ఇండియన్ బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ కిట్ల పంపిణీ

దేవీపట్నం, మే 21(ఆంధ్రజ్యోతి): యువతీ, యువకులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలని రంపచోడవరం మండల న్యాయ సేవాధికారి సంస్థ పారా లీగల్ వలంటీర్, కోకన్వీనర్ యలగాడ నాగేశ్వరరావు అన్నారు. ఇందూకూర గ్రామంలో లయ సంస్థ వ్యవస్థాపకులు డానిమిక్, నవీజాల జ్ఞాపకార్థం బుధవారం వాలీబాల్ కిట్లను న్యాయ సేవాధికారి సంస్థ సహకారంతో నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కొండ దొరల సంఘం జిల్లా నాయకుడు దూసరి హరిబాబు మాట్లాడుతూ క్రీడల్లో రాణించి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, కె.రామన్న దొర, ఎస్.రవి, కానూరు సత్యనారాయణ, యలగాడ నాగ కోటప్ప, ఎం.భను, డి.రమేష్, ఎం.ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



యువతకు వాలీబాల్ అందజేస్తున్న దృశ్యం

# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

## జిల్లా మహానాడును విజయవంతం చేయండి

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ గోదావరి కళాక్షేత్రంలో గురువారం ఉదయం 9.30 గంటలకు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అధ్యక్షతన జరిగే జిల్లా మహానాడును విజయవంతం చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ మెంబర్ జ్యోతుల నెహ్రూ కోరారు. బుధవారం జగ్గంపేటలో నెహ్రూ మీడియాతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం టీడీపీ కుటుంబ సభ్యులు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండలాధ్యక్షులు, క్లస్టర్ యూనిట్ మండల నాయకులు, అధ్యక్షులు, కార్యదర్శులు, బూత్ అధ్యక్షులు గ్రామ కమిటీ, వార్డు కమిటీలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నెహ్రూ కోరారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, జగ్గంపేట, గండేపల్లి మండలాధ్యక్షులు మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ బస్వా చిన్నబాబు, దాపర్తి సీతారామయ్య , తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

### సొమ్ములు పూర్తిస్థాయిలో రికవరీ చేయాలి



కిర్లంపూడిలో పుష్పగుచ్ఛమిస్తున్న దృశ్యం

కిర్లంపూడి, మే 21 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి మండల మహిళ సమాఖ్యలో వీవోఏల రివ్యూలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు నుంచి సొమ్ములు పూర్తి స్థాయిలో రికవరీ చేయాలని సూచించారు. భూపాలపట్నం, శృంగరాయిని పాలెం, వేలంక తిమ్మాపురం సభ్యులు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. కిర్లంపూడిలో మార్ట్‌ను పరిశీలించి సేల్స్ పెంపుపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

### జిల్లా మహానాడును విజయవంతం చేయండి

ప్రత్తిపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో గురువారం జరిగే జిల్లా స్థాయి మహానాడును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కోరారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం ఆమె మాట్లాడుతూ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు రావాలని కోరారు. కాకినాడ వివేకానంద పార్కు వద్ద గల గోదావరి కళాక్షేత్రంలో జరిగే మహానాడు జరుగుతుందన్నారు.

### ఎమ్మెల్యేను సన్మానించిన రేషన్ డీలర్లు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

ప్రత్తిపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి): రేషన్ డోర్ డెలివరీ వ్యానులను రద్దు చేసిన రేషన్ డిపోలకు రేషన్ సరుకులు అమ్మే అవకాశం కల్పించినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రత్తిపాడు మండలంలోని రేషన్ డీలర్లు బుధవారం రాత్రి ఎమ్మెల్యే సత్యప్రభను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి సన్మానం చేశారు. పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల అధ్యక్షులు, యూనియన్ సభ్యులు, వివిధ గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

### యనమలకు రేషన్ డీలర్ల సత్కారం



యనమలను సత్కరిస్తున్న రేషన్ డీలర్లు

తుని రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరఫరా చేసే మొబైల్ వాహనాలను రద్దు చేసి షాపులకు పూర్వ వైభవాన్ని తీసుకురావడం పట్ల మండల రేషన్ డీలర్లు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. రేషన్ డీలర్లంతా కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వానికి తాము రుణపడి ఉంటామని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి శివ కేశవ్ తెలిపారు.

### అక్రమ కేసులకు భయపడేది లేదు : దాడిశెట్టి

తుని రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులకు భయపడేది లేదని మాజీ మంత్రి, జిల్లా వైసీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. ఎస్.అన్నవరం వైసీపీ కార్యాలయంలో రాజా బుధవారం మీడియాతో మాట్లాడారు. మాజీమంత్రి యనమల రామకృష్ణుడు తన అధినేత జగన్మోహన్ రెడ్డిని వాడువీడని సంబోధించడం తగదని, లిక్కర్ స్కాంపై జగన్‌కు రూ.3700 కోట్లు ముడుపులు అందాయని యనమల మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

●తుని ఎమ్మెల్యే యనమల దివ్య

కోటనందూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. బుధవారం కేఈ చిన్నాయిపాలెంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు అధ్యక్షతన ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించారు. ఇళ్ల పట్టాలు, భూ సమస్యలు, పింఛన్లు, తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదును తక్షణం పరిష్కరిస్తామని, కోటనందూరు మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో అంకరెడ్డి రమేష్, డి.చిరంజీవిరాజు, పోతల సూరిబాబు, వెలగా వెంకట కృష్ణరావు, షేక్ నావాబ్‌జానీ, పెనుమచ్చ నాగేశ్వరరావు అంకంరెడ్డి బుల్లిబాబు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

## వైద్యులు సేవాదృక్పథంతో పనిచేయాలి : ఎమ్మెల్యే



ప్రత్తిపాడులో వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో వైద్యులు సేవా దృక్పథంతో పని చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కోరారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి సమీపంలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన వైద్యశాలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు కె.కోటేశ్వరరావు, రఘురాం, శారదాదేవి, ఏలేశ్వరం సీహెచ్‌సీ విశ్రాంత సూపరింటెండెంట్ ఏవీ.రమణ, డాక్టర్ చిట్టికొండ, మదినే గంగాధర్, విశ్రాంత హెడ్ నర్స్ ప్రమీలా దేవి, టీడీపీ నాయకులు అమరాది వెంకట్రావు, చలంకూరి భాను, ముత్యాల రాంబాబు మాజీ సర్పంచ్‌లు యాళ్ల విశ్వేశ్వరరావు,మదినే దొరబాబు, మదినే స్వామి, మదినే శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరంలో రైళ్లకు హాల్టింగ్ కల్పించాలి

శంఖవరం, మే21 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రమైన అన్నవరం రైల్వేస్టేషన్‌లో ఎల్‌టీటీ న్యూఢిల్లీ, గరీబ్‌రథ్, ఇతర ముఖ్యమైన రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని డీఆర్‌యూసీసీ సభ్యుడు గొర్లి నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు. వినియోగదారులకమిటీ సభ్యుడిగా ఎన్నికైన తర్వాత మొదటిసారి విజయవాడలో కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. తుని, అన్నవరంలో పలు రైళ్ల హాల్టుతో పాటు కాకినాడ పార్లమెంటులో అన్ని రైల్వే స్టేషన్ల పరిధిలో తాగునీరు, మరుగదొడ్ల సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు. కాకినాడ నుంచి సాయినగర్ షిర్డీ వెళ్లే ట్రైనులో జనరల్ బోగీలు పెంచాలని కోరారు. సమావేశంలో తాను తెలిపిన సమస్యలపై రైల్వే డీఆర్ఎం సానుకూలంగా స్పందించినట్టు నాగేశ్వరరావు తెలిపారు. కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినియోగదారులకు మెరుగైనసేవలు అందించే విధంగా కృషి చేస్తానన్నారు.

## రెండు వేల రూఫ్‌టాప్‌ల ఏర్పాటే లక్ష్యం : పీడీ

ప్రత్తిపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి మండలంలో రెండు వేల రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం మండల మహిళా సమాఖ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో భాగంగా ప్రతి మండలంలో రెండువేల రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయడానికి డ్వాక్రాసంఘాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకానికి సంబంధించి కేంద్రప్రభుత్వ రాయితీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన డ్వాక్రాసభ్యులు యూనిట్లు ఏర్పాటుచేయాలని ప్రతి డ్వాక్రా మహిళ తమ ఇంటి ఆవరణలో పెరటితోటల పెంపకం చేపట్టాలని సూచించారు. ఏపీఎం ఏపీడీ జిలానీ, డీపీఎంలు రాయి, భరత్, అనిల్, వై.వెంకట్, సీసీలు శ్రీనివాస్, నూకరత్నం, ఎంఎస్‌కే నాగేశ్వరరావు, 56 మంది వీఓఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

## పొదుపు సంఘాలతో మహిళలకు లబ్ధి

ఏలేశ్వరం, మే 21 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలతో మహిళలకు లబ్ధి చేకూరుతుందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మహిళా సంఘాల సమావేశం నిర్వహించారు. సీఎం చంద్ర బాబుతోనే మహిళా సంఘాలు ఏర్పడ్డాయన్నారు. మహిళలు అన్ని రంగాల్లోను రాణించాలనే ఉద్దేశ్యంతో స్వయం ఉపాధి కల్పనకు కృషి చేశారన్నారు.

కార్యక్రమంలో వెలుగు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ‘అడ్డకొండ భూమి పేదలకు దక్కే వరకు రాజీలేని పోరాటం’

జగ్గంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): మల్లిసాల అడ్డకొండ భూమి పేదలకు దక్కే వరకు రైతుకూలీ సంఘం పోరాటం ఆగదని ఏపీ ఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. బుధవారం అడ్డకొండ భూమి మామిడితోటలో అక్రమంగా ఏలేటి పద్మరాజు, ఏలేటి రమేష్ కుటుం బాలు మామిడికాయలు కోస్తుండగా అడ్డుకున్నారు. తహశీల్దార్, సర్పంచ్, పోలీసులు వచ్చి ఏలేటి ఫ్యామిలీని నిలువ రించి రైతు కూలీ సంఘం నాయకులతో మాట్లా డారు. అనంతరం తహ శీల్దార్, మం డల సర్వేయర్ సర్వే నిర్వహించడానికి ఉపక్రమించారు. ఆర్‌సీఎస్ ఉమ్మడిజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, రాష్ట్ర నాయకులు కొండా దుర్గా రావు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు, పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ పాల్గొన్నారు.

### ఆరోగ్యకర జీవనానికి యోగా అవసరం

రంపచోడవరం, మే 21(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర జీవనం కోసం అందరూ యోగా చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అన్నారు. రంపచోడవరంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ యోగా ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. రంపచోడవరం అంబేడ్కర్ సెంటర్లో మానవహారం జరిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో డీఎన్‌వీ రమణ, పశుసంవర్థక శాఖ డీడీ షరీఫ్, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, డీఎల్‌పీవో పద్మ, ఎంపీడీవో శ్రీనివాసదొర తదితరులు పాల్గొన్నారు.

### యోగా ర్యాలీ

మోతుగూడెం, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ యోగా దినోత్సవాన్ని బుధవారం ఐటీడీఏ ఆధ్వర్యంలో చింతూరులో నిర్వహించారు. స్థానిక ఆశ్రమ బాలికల స్కూల్ నుంచి వివిధ శాఖల ఉద్యోగులతో ర్యాలీ నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి అపూర్వభరత్ మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని, ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం కోసం 30 నిమిషాలు యోగాకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి, చింతూరు తహశీల్దార్, ఎంపీడీవో ఇతర అధికారులు పాల్గొన్నారు.



### స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పాటించరా?



సుబ్బయ్యమ్మపేట గ్రామ శివారున గుట్టలుగా చెత్త పోగులు

గండేపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఒక పక్క ప్రభుత్వం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ద్వారా గ్రామాల్లో పారిశుధ్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఆదేశించినప్పటికీ పలువురు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు అంటున్నారు. మండలంలో సుబ్బయ్యమ్మపేట గ్రామ శివారున చెత్త పోగులు గుట్టలుగా ఉన్నాయి. దీంతో గ్రామశివారున చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### ‘ఆదిత్య’లో డ్రైవర్లకు అవగాహన



మాట్లాడుతున్న ఆదిత్య చైర్మన్ శేషారెడ్డి

గండేపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆదిత్య యూనివర్సిటీలో డ్రైవర్లకు భద్రతా నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కె.శ్రీధర్, గౌరవ అతిథులుగా జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీవీ.మురళీకృష్ణ, జిల్లా రహదారి భద్రతా విభాగం వైద్యాధికారిణి డాక్టర్ ఏ.వి.పద్మావతి పాల్గొన్నారు. శేషారెడ్డి మాట్లాడుతూ ఆదిత్య డ్రైవర్ల సంక్షేమం, వారి ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, హెల్మెట్ లేకుండా, సీట్‌బెల్ట్ పెట్టుకోకుండా ప్రయాణం చేయడం నేరమని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం ప్రమాదమని అతిథులు వివరించారు. వారికి ఆదిత్య యాజమాన్యం తరుపున జ్ఞాపికను అందించారు.

**ప్రశాంతంగా ఏపీఈఏపీసెట్ పరీక్షలు**

విద్యా ప్రాంగణంలో ఏపీఈఏపీసెట్-2025 ఆన్లైన్ పరీక్షలు మూడోరోజు ప్రశాంతంగా జరిగినట్టు యూనివర్సిటీ డిప్యూటీ ప్రొ ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉదయం 237 గాను 228 మంది, మధ్యాహ్నం 239 గాను 231, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 295 గాను 281, మధ్యాహ్నం 294 గాను 288 మంది హాజరయ్యారు.

### ప్రత్తిపాడులో రాజీవ్‌గాంధీ వర్ధంతి



కళామందిర్ సెంటర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రత్తిపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి): భారతరత్న మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతిని బుధవారం ప్రత్తిపాడులో నిర్వహించారు. అంబేడ్కర్ కళామందిర్ సెంటర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పీసీసీ సభ్యుడు దర్నాల కోట శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ దేశంలో సైన్స్, టెలికమ్యూనికేషన్, తదితర రంగాలకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఇరుగుల చక్రం, కాకర రాజేష్, గుర్రాల నల్లయ్య, మాదేరమణ పాల్గొన్నారు.

### పెద్దిపాలెంలో వ్యక్తి అరెస్ట్

ప్రత్తిపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిపాలెంలో స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది బుధవారం నడిగట్ల నూకరాజు అనే వ్యక్తిని పీడీ యాక్ట్ కింద అరెస్ట్ చేసినట్లు బుధవారం సీఐ పి. శివప్రసాద్ చెప్పారు. నూకరాజును రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.